క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి తులాభారసేవ



తులాభారసేవ నిర్వహిస్తున్న అర్చకులు

జామి:భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయపాలక మండలి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి స్వామివారికి పటిక బెల్లంతో తులాభార సేవను సింహాచలం దేవస్థానం వేదపండితులు నిర్వహించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుకు వేణుగోపాల స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు, వేదపండితులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోని బంగారమ్మ కాలనీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వేణు గోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు శనివారంతో ముగిసాయి. ఆలయ ధర్మకర్తలు బమ్మిడి అప్పలస్వామి, బమ్మిడి కృష్ణమ్మ దంపతులు, ఆలయకమిటీ నేతృత్వంలో ప్రత్యేక పూజలు,అన్నదానం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు స్వామి వారిని దర్శించుకున్నారు. జెడ్పీ చైర్మన్‌తో వేదపండితులు ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

శృంగవరపుకోట: ఒడిసాలోని బాలాసోర్ ప్రాంతంలో జరిగిన రైల్వే ప్రమాదంలో మృతులకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శనివారం నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఇది పెద్ద ప్రమాదం కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈవిపత్తులో అన్ని వర్గాల ప్రజలు, యువత సహాయ సహకారాలు అందివ్వాలని కోరారు.

వలంటీర్లకు సన్మానం



వలంటీర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

దత్తిరాజేరు: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా దత్తి,దత్తిరాజేరు సచివాలయాల పరిధి వలంటీర్లను ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు శనివారం సన్మానించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, జేసీఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మజ్జి అప్పలనాయుడు, చుక్క మురళీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలు రేపు

చీపురుపల్లి: పట్టణంలోని గీతా మందిరంలో ఈనెల 5న శ్రీమద్భగవద్గీతపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు మందిర నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల కు గీతా మందిరం ప్రాంగణంలో పోటీలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. ఆసక్తి గల విద్యార్థులు హాజరవ్వాలని, విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొత్తవలస: ఎల్.కోట మండలం లచ్చింపేట గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి కొత్తవలస మండలం మంగళపాలెం గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు రూ. 50 వేల విరాళం శనివారం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 7వ తేదీన ఆలయ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రం అందజేశారు.

నాడు- నేడు పనుల పరిశీలన

వేపాడ: 2023-24 విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో నాడు-నేడు పనులను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి పి.ఎస్. వి.లక్ష్మీనారాయణ అన్నారు. వావిలపాడు ఉన్నత పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కె.పట్నాయక్‌తో కలిసి శనివారం పరిశీలించారు. అదనపు భవనాలు, మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు ఇతర పనులను పూర్తి చేయాలని సూచించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- అధికారులకు స్పెషల్ ఆఫీసర్ల ఆదేశం



చీపురుపల్లి: సమీక్ష నిర్వహిస్తున్న మండల ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్



వేపాడ: అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ

చీపురుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి(స్పెషల్ ఆఫీసర్) కె.రాజ్‌కుమార్ అధి కారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో శనివారం సమన్వయ సమావేశం నిర్వ హించా రు. శాఖల వారీగా అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల భవన నిర్మాణాలు, నాడు-నేడు పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం బిల్లులను వెంట వెంటనే మంజూరు చేస్తున్న విషయాన్ని కాంట్రాక్టర్లకు గుర్తు చేయాలని సూచించారు. అలాగే వైఎస్సార్ సంపూర్ణ గృహ హక్కు పథకంలో భాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో నిర్మాణపనులను హౌసింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పూర్తి చేయించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. జల జీవన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంకా అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వారి వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

వేపాడ: మండలంలో ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టిసారించడంతో పాటు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయించాలని వివిధ శాఖల అధికారులకు మండల ప్రత్యేక అధికారి పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడైనా ఉందా, బోర్లు మరమ్మతులు చేపట్టాల్సి ఉందా అని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆరా తీశారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందిస్తూ సమ్మర్‌క్రాష్ పోగ్రాంలో తాగునీటి సమస్యలను పరిష్కరించామని తెలిపారు. గృహనిర్మాణాలపై శ్రద్ధ వహించాలని, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని అధికారులను స్పెషల్ ఆఫీసర్ ఆదేశించారు. ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్, డీటీ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయించాలి

కొత్తవలస: మండలంలో ప్రభుత్వ భవనాలు, ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల అధికారులను మండల ప్రత్యేక అధికారి ఎస్.పాపారావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. మండలంలోని అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. నాడు- నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో పనులను వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచేనాటికి పూర్తి చేయాలని,అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను కూడా సకాలంలో పూర్తి చేయాలన్నారు. జగన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు.పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేయాలని ఆ శాఖ సిబ్బందికి సూచించారు.



కొత్తవలస: అధికారులతో సమావేశమైన మండల ప్రత్యేక అధికారి పాపారావు

ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు

గంట్యాడ: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో మండల అధికారులతో శనివారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సఖి గ్రూపులు గ్రామాల్లో సమర్థవంతంగా పనిచేయాలని, బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి కిషోర బాలికలకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఎంపీడీఓ భానోజీరావు, ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ: మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

స్కూళ్లు తెరిచే నాటికి పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: నాడు-నేడుకు ఎంపికైన పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేసవి సెలవుల అనంతరం స్కూళ్లు తెరిచే నాటికి పూర్తి చేయాలని ఎంపీపీ చల్లా చలం నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కన్వర్జెన్సీ పనులకు సంబంధించి మండల అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలతో పాటు ఉపాధి నిధులతో చేపట్టే అన్ని పనులను వేగవంతం చేయించాలని సూచించారు. సచివాలయాలు, ఆర్బీకేలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పూర్తి చేసి సేవలకు సిద్ధం చేయాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గా ప్రసాద్, తహసీల్దార్ డి.ఎస్.జి.ఎస్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

8న నెలివాడ ఉప సర్పంచ్ ఎన్నిక

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పదవికి ఈ నెల 8వతేదీన 11 గంటలకు ఎన్నిక నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ సీహెచ్ సుగుణాకరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప సర్పంచ్ కోన రామబంగారయ్య తన పదవికి చేసిన రాజీనామా ఆమోదం పొందిందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో తిరిగి ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తున్నామని, సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులకు సమాచారం అందించామని స్పష్టం చేశారు.

సంక్షిప్తంగా...

నేడు దివ్యాంగులకు అవగాహన

శృంగవరపుకోట: స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఏపీ దివ్యాంగుల నెట్‌వర్క్(ఎన్‌పీడీఓ) నేతృత్వంలో దివ్యాంగులకు పథకాలు, ఉపాధి అవకాశాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు ఎన్‌పీడీఓ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జె.రమణ శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్ర మానికి ఎన్‌పీడీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యులు జీ.వి.ఎల్. నరసింహారావు, వికలాంగ సంక్షేమశాఖ ఏడీ జగదీష్, ఎస్.కోట నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ కె.నర్సింగరావు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. అయిదు మండలాల దివ్యాంగులు హాజరు కావాలని కోరారు.

ఎల్.కోట ఆర్‌ఐగా సన్యాసిరావు



సన్యాసిరావు

లక్కవరపుకోట: మండల రెవెన్యూ అధికారిగా కె.వి.ఎస్.సన్యాసిరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఆర్‌ఐగా పనిచేసిన రాజేష్‌కు కొత్తవలస బదిలీ కాగా, చీపురుపల్లి నియోజకవర్గం ఎలక్షన్ సీనియర్ అధికారిగా పనిచేసిన సన్యాసిరావును ఇక్కడికి బదిలీ చేశారు. పలువురు వీఆర్‌ఓలు ఆయనకు స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

తహసీల్దార్‌గా విజయభాస్కర్



తహసీల్దార్ విజయభాస్కర్

మెరకముడిదాం: మండల తహసీల్దార్‌గా పి.విజయ భాస్కర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజాం మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అలాగే మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా శనపతి తవిటి నాయుడు దత్తిరాజేరు మండలం నుంచి బదిలీపై వచ్చారు. జూనియర్ సహాయకులుగా బోనెల ఆదిలక్ష్మి తెర్లాం మండలం నుంచి బదిలీపై వచ్చారు.

సోంపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

వేపాడ: మండలంలో బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమాదేవి ఆధ్వర్యంలో సోంపురం గ్రామంలో శనివారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి 98 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం గృహసందర్శన చేసి ప్రజలకు వైద్య తనిఖీలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ అరుణకుమారి, ఏఎన్‌ఎం స్వప్నకుమారి, డీఈఓ శ్రీనివాసరావు, ఆశ వర్కర్లు వసంత, శాంతి పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

బొండపల్లి: దేవుపల్లి పీహెచ్‌సీ పరిధిలో క్షయరోగులకు అరబిందో ఫార్మా కంపెనీ వారు సమకూర్చిన నిత్యావసర సరుకులతో పాటు,పౌష్టికాహారాన్ని వైద్యాధికారి జె.ఝాన్సీలక్ష్మి శనివారం పంపిణీ చేశారు. క్రమం తప్పకుండా వైద్య సిబ్బంది ఇచ్చే మందులను వాడడం ద్వారా వ్యాధి నుంచి త్వరగా కోలుకోవచ్చునిచెప్పారు. హెల్త్ సూపర్ వైజర్ బోద నారాయణ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు ఏపీఓకు బదిలీ

దత్తిరాజేరు: ఉపాధి హామీ పథకంలో మండల ఏపీఓగా పని చేస్తున్న ఎం సత్యవతికి వంగర మండలానికి బదిలీ అయినట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు.కొత్తవారిని మండలానికి పంపిస్తారా,రెండవ ఏపీఓగా ఉన్న వెంకటప్పలనాయును కొనసాగిస్తారా తెలియాల్సి ఉందని అన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మెరకముడిదాం: మండలంలోని ఎం.రావివలస గ్రామంలోని రమణచెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు శనివారం పరిశీలించారు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ పనులకు హాజరైన వారు నిబంధనల ప్రకారం కచ్చితంగా పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పనులు చేస్తే గరిష్ఠ వేతనం రూ.272 అందుతుందన్నారు. క్షేత్రసహాయకుడు పిన్నింటి రాంబాబు ఏపీఓ వెంట ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు పదిమంది ఎంపిక

జామి: మండలంలో కుమరాం ఉన్నతపాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్(జాతీయ ఉపకార వేతనాలు)కు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.పద్మావతి శనివారం తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్‌కు నిర్వహించిన పరీక్షల్లో పాఠశాలకు చెందిన మట్టా ఉష్రశ్రీ జిల్లా స్థాయిలో మొదటిస్థానంలో నిలిచిందని హెచ్‌ఎం చెప్పారు.విద్యార్థులను ఉపాధ్యాయసిబ్బంది అభినందించారు.

బాలలనుపనిలో పెట్టుకుంటే చర్యలు

గంట్యాడ: బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో శనివారం చైల్డ్ రెస్క్యూ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు రెస్క్యూ నిర్వహించనున్నట్టు తెలిపారు. బాలలను పనికి పంపి తల్లిదండ్రులు వారి భవిష్యత్తును నాశనం చేయవద్దని తెలిపారు. బడిఈడు పిల్లలను బడికి పంపించి చదువుకునే విధంగా చూడాలన్నారు. ఎంఈఓ విజయలక్ష్మి, చైల్డ్ లైన్ 1098 కో-ఆర్డినేటర్ మీనా తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ వద్దు

శృంగవరపుకోట: విశాఖ- అరకు రోడ్డు విస్తరణ కోసం రైతుల నుంచి బలవంతపు భూసేకరణ చేయడం సరికాదని ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో పలువురు రైతుసంఘం నాయకులు, రైతులు శనివారం స్థానిక తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందచేశారు. రైతు సంఘ నాయకులు మద్దిల రమణ, గేదెల శ్రీను మాట్లాడుతూ ముందస్తు నోటీసులు లేకుండా, రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా నేరుగా భూముల్లో సర్వే రాళ్లు పాతిపెట్టడం సరైన చర్య కాదన్నారు. రైతులకు ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అంటూ ప్రశ్నించారు. వెంకటరమణపేట గ్రామం వద్ద నిర్ణయించిన బైపాస్‌ను రైతులు వ్యతిరేకించి శనివారం సర్వే పనులు అడ్డుకున్నారని, అధికారులు తక్షణం రైతాంగం డిమాండ్ల సాధనకు చొరవ చూపాలని కోరారు. వెంకటరమణపేట, కొత్తూరు, సీతంపేట, ఎస్‌కోట గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

గజపతినగరం: స్థానిక సూర్య థియేటర్ సమీపంలో చంపావతి నది వద్ద ఆక్రమణలను శనివారం తొలగించామని తహసీల్దార్ ఎం.అరుణకుమారి తెలిపారు. చంపావతి 13వ వంతుల చానెల్‌కు సంబంధించిన కొంత భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించినట్లు పిడిశీల, సీతారామపురం,కాలంరాజుపేట,డోలపాలెం తదితర గ్రామాల రైతులు స్పందనలో ఫిర్యాదు చేశారని, వారి ఫిర్యాదు మేరకు సర్వే చేసి ఆక్రమణలు గుర్తించామని తహసీల్దార్ చెప్పారు. ఆక్రమణలకు గురైన ప్రాంతాన్ని జేసీబీతో లెవెల్ చేయించామని చెప్పారు.

కాలుష్య నివారణకు కృషి చేయాలి

చీపురుపల్లి: కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ యువ కేంద్రం, ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందజేత



కొత్తవలస: వృద్ధుడికి విశాఖ కేజీహెచ్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్లు

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామానికి చెందిన మతల అప్పలనాయుడు, గొంప పెంటమ్మ అనారోగ్యంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వీరికి జూన్ నెలకు సంబంధించిన వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్లు మురళీకృష్ణ, గౌరినాయుడు శనివారం విశాఖపట్నం వెళ్లి అందజేశారు.

లక్కవరపుకోట: శ్రీరాంపురం గ్రామానికి చెందిన కొల్లు మరిడమ్మ అనారోగ్యంతో కొద్ది రోజులుగా విజయనగరం పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామ వలంటీర్ వానపల్లి పద్మ శనివారం విజయనగరం వెళ్లి దివ్యాంగ పింఛన్‌ను అందజేశారు.

గంట్యాడ: మండలంలోని కొఠారుబిలి గ్రామానికి చెందిన చప్ప సింహాచలం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్నారు. అతనికి గ్రామానికి చెందిన వలంటీర్ వేమలి ప్రమీల సర్వజన ఆస్పత్రికి వచ్చి శనివారం పింఛన్ డబ్బులు అందజేశారు.

జాప్యం లేకుండా బిల్లుల చెల్లింపు



వేపాడ: కొండగంగుబూడిలో గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

వేపాడ: గృహ నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను నిర్మాణాల దశ ఆధారంగా జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు చెల్లిస్తున్నామని మండల ప్రత్యేక అధికారి పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ తెలిపారు. హౌసింగ్‌డే సందర్భంగా మండలంలోని కొండ గంగుబూడిలో గృహనిర్మాణాలను అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించా రు. లబ్ధిదారులతో అధికారులు మాట్లాడుతూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలకు ఇసుక, సిమెంట్ ప్రభుత్వం అందిస్తోందని, అవసరమైన లబ్ధిదారు లు ఐకేపీ ద్వారా రూ.35వేల రుణం పొందవచ్చని చెప్పారు. కొండ గంగుబూడి పంచాయతీలో 84 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 50 గృహనిర్మాణాలు పూర్త య్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని ఏఈ అప్పలనాయుడు తెలిపారు. ఎంపీడీఓ పట్నా యక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ దేవి, ఐకేపీ ఏపీఓ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఏఈ సూరిబాబు, వైస్ ఎంపీపీ దాయిరి ముత్యాలమ్మ, సర్పంచ్ బంగారయ్య అవగడ్డ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

బొండపల్లి: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గా ప్రసాద్ లబ్ధిదారు లకు సూచించారు. హౌసింగ్ డేలో భాగంగా మండలంలోని బోడసింగిపేట జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన వారు త్వరగా పూర్తి చేయాలని, ఇంకా పనులు ప్రారంభించని వారు త్వరగా మొదలు పెట్టాలని, లేకుంటే పట్టాలను, ఇళ్లను రద్దు చేస్తామని చెప్పారు. నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఏపీఓ కృష్ణవేణి, ఏపీఎం సులోచనాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జేవీకే కిట్ల పంపిణీ



జేవీకే కిట్ల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రమేష్

గజపతినగరం: జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం నుంచి పంపిణీ చేయాలని ఎంఈఓ విమలమ్మకు మండల ప్రత్యేక అధికారి పి.రమేష్ సూచించారు. మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జేవీకే కిట్ల స్టాక్ పాయింట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. స్పందన కార్యక్రమానికి అందే వినతులు, వాటిలో ఎన్నింటిని పరిష్కరించారు, తదితర అంశాలపై ఎంపిడీఓ పప్పు సుదర్శనంను ఆరా తీశారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గురించి ఏపీఓ సీహెచ్.రామారావును అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎం.అరుణకుమారి, ఈఓపీఆర్డీ జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని సుభాషిని కామన్ సర్వీస్ సెంటర్ వద్ద దాస్ మెమోరియల్ చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. సుభాషిని కామన్ సర్వీస్ సెంటర్ ప్రతినిధులు, ట్రస్టు సభ్యులు వాండ్రంగి వెంకటేష్, పట్నాయికుని శంకరరావు, వార్డుమెంబర్ బోడసింగి సత్యనారాయణ, సతీష్, గోవిందరావు, గణపతిరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

3వేల మందికి మజ్జిగ పంపిణీ

గరివిడి వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 3 వేల మందికి శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.వి.ఎస్.ఎస్.ఎన్.గుప్త, సంఘం ప్రతినిధులు వెంకటరాజు, సత్యారావు, సతీస్, అప్పలరాజు,లక్ష్మణరావు,సూర్యారావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ఎస్.కోటకు చెందిన సంతోషికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కొత్తవలస: ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలను ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఆపద్బాంధవిలా ఆదుకుం టోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలో పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే స్థానిక క్యాంపు ఆఫీస్‌లో శనివారం పంపిణీ చేశారు. ఎస్.కోట పట్టణానికి చెందిన కొట్యాడ సంతోషి కుమారుడికి కిడ్నీ సంబంధిత శస్త్ర చికిత్స కోసం లక్ష రూపాయలు, కొత్తవలస మండలం చీడివలస గ్రామానికి చెందిన రొంగళి చిన్నపామరుకి కంటి ఆపరేషన్ నిమిత్తం రూ.24వేల చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో నియోజకవర్గం పరిధిలో వందలాది మంది బాధితులకు కోట్ల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అందజేశామని చెప్పారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, కొత్తవలస పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, ఎస్.కోట మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మోపాద కుమార్, పుణ్యగిరి ట్రస్టు చైర్మన్ పి.రామకృష్ణ, ఎంపీటీసీ లెంక వరహాలు, నాయకులు చెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జామి-కొట్టాం వంతెన పరిశీలన



వంతెనను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జామి: గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల నిమిత్తం భారీ వాహనాల రాకపోకలతో జామి-కొట్టాం వంతెనపై రోడ్డు దెబ్బతింది. సమస్యపై జిల్లా అధికారులకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, విజినిగిరి, తాండ్రంగి సర్పంచ్‌లు కె.సూర్యారావు, కె.దశరథ్, మాజీ జెడ్పీటీసీ బండారు పెదబాబు తదితరులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్అండ్‌బీ ఈఈ జి.వి.రమణ, జేఈ గుప్తా వంతెనను శనివారం పరిశీలించారు. అనంతరం హైవే అధికారులు రాజారావు తదితరులతో చర్చలు జరిపారు. వంతెన చాలావరకు పాడైపోయిందని, మరమ్మతులు చేయకపోతే పూర్తిస్థాయిలో దెబ్బతింటుందని హైవే అధికారులకు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. హైవే అధికారులు స్పందిస్తూ గతంలోనే మరమ్మతులు చేపడతామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చామని, త్వరలో వంతెన,రహదారి మరమ్మతులు చేపడతామని తెలిపారు.